ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 24 డిసెంబరు 2024



అలంకారప్రాయంగా మారిన శ్రీరామ ఎత్తిపోతల పథకం





సోమశిల వెనుకజలాల్లో అలంకారప్రాయంగా ఉన్న శ్రీరామ ఎత్తిపోతల పథకం ట్యాంకు

ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట రామాలయాన్ని 2014లో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది. ఒంటిమిట్ట చెరువును ట్యాంక్ బండ్ రీతిలో అభివృద్ధి చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సోమశిల వెనుకజలాల నుంచి ప్రత్యేక ఎత్తిపోతల పథకాన్ని 33.83 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రారంభించారు. అప్పటి నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు పుష్కలంగా నీరు వచ్చేది. దీని ద్వారా 1500 ఎకరాల ఆయకట్టు సాగయ్యేది. పరోక్షంగా మరో వెయ్యి ఎకరాలకు సాగునీరు అందేది. ఒంటిమిట్ట మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి సాగునీరు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేది. అయితే జగన్ సీఎం కాగానే ఈ పథకానికి గ్రహణం పట్టుకుంది. వైసీపీ ఐదేళ్ల హయాంలో ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు.

రామ.. రామా..!

- రూ.34 కోట్ల శ్రీరామ ఎత్తిపోతల పథకానికి గ్రహణం
- మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయని జగన్ ప్రభుత్వం
- ఐదేళ్ల పాటు మూలనపడ్డ పథకం
- చెరువు ఆయకట్టుకు సాగునీరు కరువు
- చెరువులో నీరు లేకపోవడంతో కనిపించని పర్యాటక శోభ
- ముళ్లచెట్లతో వెలవెలబోతున్న ఆయకట్టు భూములు
- ఆశలన్నీ చంద్రబాబుపైనే..
- పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

రాజంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి అయిన వెంటనే ఒంటిమిట్టకు గ్రహణం పట్టుకుంది. జగనన్న రావడంతోనే ఈ ఎత్తిపోతల పథకానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమశిల వెనుకజలాల నుంచి చెరువుకు నీరందించే ఈ ఎత్తిపోతల పథకాల మోటార్లు చెడిపోవడం, పైపులైన్లు దెబ్బతినడం, నీరందించే బావులు పూడిపోవడం లాంటి సమస్యలు ఏర్పడ్డాయి. రూ.34 కోట్లతో ఏర్పాటు చేసిన పథకానికి జగన్ ప్రభుత్వం మరమ్మతు ఖర్చులు కూడా కేటాయించకుండా మొండిచేయి చూపింది. ఈ ఎత్తిపోతల పథకాన్ని రైతులకు అప్పజెప్పామని, ఈ చెరువు కింద ఉన్న రైతులు ఆయకట్టు సంఘం ద్వారా వారి భూవిస్తీర్ణాన్ని బట్టి నిధులు సేకరించుకుని రైతులే మరమ్మతులు చేయించుకోవాలని అధికారుల ద్వారా సెలవిచ్చింది. ఈ విధంగా 2019 నుంచి 2024 వరకు ఈ ఎత్తిపోతల నీటి పథకానికి పైసా నిధులు మరమ్మతులకు కేటాయించకపోవడంతో అధికారులు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేశారు. దీనివల్ల జగన్ పరిపాలించిన ఐదేళ్లు ఈ పథకాన్ని రిపేర్లు చేయించుకోలేక మూలనపడేశారు. దీంతో చెరువుకు చుక్కనీరు లేక వెలవెలబోయి ఆయకట్టు భూమి అంతా బీడుగా మారింది. చెరువులో నీళ్లు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోరు బావులు చుక్కనీరు రాకుండా ఎండిపోయాయి. ఆలయం చుట్టూ ఉన్న చెరువు ప్రాంతం అంతా, అటు చెరువు పక్కన, ఇటు ఆయకట్టు భూమి అంతా ముళ్లచెట్ల మయమై కళావిహీనంగా మారింది. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల పెన్నా నది ఏడాది పొడవునా పొంగి ప్రవహిస్తోంది. ఈ స్థితిలో సోమశిల ప్రాజెక్టు సుమారు 80 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది. అయితే ఈ శ్రీరామ ఎత్తిపోతల పథకం పైపులైన్లు దెబ్బతినడం, మోటార్లు రిపేరుకు నోచుకోకపోవడం, బోరు బావులు పూడిపోవడం వల్ల ఒంటిమిట్ట చెరువుకు చుక్కనీరు రావడం లేదు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఎగువ ప్రాంత అడవుల నుంచి వచ్చిన కొద్దిపాటి వరదనీరు వల్ల చెరువులో ఒక అడుగు లోతు నీరు వచ్చి గుంతలు నిండాయి. మామూలుగా ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వచ్చి ఉంటే పుష్కలమైన నీటితో కళకళలాడి ఆయకట్టు ప్రాంతమంతా పచ్చని పొలాలతో కోనసీమగా ఉండేది. ఇప్పుడు ఇంత భారీ వర్షాలు కురిసినా సోమశిలకు కావాల్సినంత నీరు బ్యాక్‌వాటర్‌లో ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. దీనివల్ల వర్షాకాలంలో చెరువును నీళ్లతో నింపుకోలేక ఆయకట్టు రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

చంద్రబాబు ప్రభుత్వంపై ఆశలు

ఈ స్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఈ ప్రాంత రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ విషయమై ఆ ప్రాంత రైతులు, నాయకులు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకం దీనావస్థను వివరించారు. వెంటనే శ్రీరామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైన్లను మార్చి ఇనుప పైపులైన్లు ఏర్పాటు చేయాలని, మోటార్లు రిపేరు చేయాలని, పూడిపోయిన బావులను బాగు చేయించాలని, ఈ పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి నీరందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఆనాడు నిర్దేశించిన ప్రకారం చెరువులో నీరు నింపి చెరువులో బోటు షికారు చేయించి ఆలయానికి చుట్టూ ఉన్న చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో దేవతా విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆధ్యాత్మిక శోభను ఈ ప్రాంతంలో నెలకొల్పి రైతులకు, ఈ ప్రాంతీయులకు సాగు, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ముఖ్యమంత్రితో ఈ విషయంపై చర్చిస్తాం..



శ్రీరామ ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో త్వరలో చర్చించి నిధులు మంజూరయ్యేటట్లు చేస్తాం. ఇప్పటికే సంబంధిత అధికారులతో ఈ విషయంపై మాట్లాడి శ్రీరామ ఎత్తిపోతల పథకం మరమ్మతులపై చర్చించాం. ఈ ప్రాంత అభివృద్ధిని, ఆధ్యాత్మికతను పెంపొందించాలంటే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి చెరువుకు నీరందించడమే శరణ్యం.

- సాయిలోకేష్‌కుమార్, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు, రాజంపేట

మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడాం..



ఈ విషయమై రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడి వినతిపత్రం సమర్పించాం. ఇంత పెద్ద ఎత్తిపోతల పథకానికి జగన్ ప్రభుత్వం మరమ్మతుల ఖర్చులు కూడా వెచ్చించకపోవడంతో ఈ పథకం మూలన పడింది. దీని ద్వారా ఒంటిమిట్ట ప్రాంతమంతా అటు సాగునీటికి, ఇటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

- బొబ్బిలి రాయుడు, ఒంటిమిట్ట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి

'శ్రీరామ ఎత్తిపోతల'ను పునరుద్ధరించాలి..



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలి. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. 10 కోట్ల రూపాయల నిధులను కేటాయించి దెబ్బతిన్న పైపులైన్లను తీసివేసి కొత్తపైపులైన్లు ఏర్పాటు చేయాలి. యుద్ధప్రాతిపదికన పనులకు శ్రీకారం చుట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుని దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక శోభను కలిగించాలి.

- పాటూరు గంగిరెడ్డి, ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షుడు



ఒంటిమిట్ట చెరువులో గుంతలకు చేరిన వర్షపునీరు



కంపచెట్ల మయమైన ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు భూమి



తరచూ చెడిపోతున్న ఎత్తిపోతల పథకం పైపులైను

మరణంలోనూ వీడని బంధం

- ఒకేరోజు శతాధిక భార్యాభర్తల మృతి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ వందేళ్లకు పైగా కలిసిమెలిసి అన్యోన్యంగా జీవించారు. కొడుకులు, కూతుర్లు, మనవలు, మనవరాళ్లు, మునివళ్లు, మునిమనవరాళ్లతో ఎంతో సరదాగా గడిపారు. ఆ కుటుంబంలో మొత్తం 160 మంది ఉన్నారు. వారిద్దరూ ఐదు తరాల వారిని చూశారు. అయితే ఆ భార్యభర్తలు ఇద్దరూ ఒకేరోజు మృతి చెందడంతో ఆ పేద్ద కుటుంబం విషాదంలో మునిగిపోయింది. లక్కిరెడ్డిపల్లె మండలంలోని పందిళ్లపల్లి గ్రామం బురుజుపల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బురుజుపల్లి గ్రామానికి చెందిన ఉదయగిరి పెద్దసుబ్బరాయుడు (108), పెద్దకేశమ్మ (104)లు ఆదివారం ఒకేరోజు మృతి చెందారు. పెద్దసుబ్బరాయుడు రైతు. ఆదివారం ఉదయం 11 గంటలకు పెద్దసుబ్బరాయుడు మృతి చెందగా దానిని జీర్ణించుకోలేక ఆయన భార్య పెద్దకేశమ్మ సాయంత్రం 3 గంటలకు మృతి చెందింది. వీరి జీవితం వంద సంవత్సరాలకు పైగా కొనసాగి ఒకేరోజు ఇద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వీరికి 11 మంది సంతానం. 5 మంది మగబిడ్డలు, ఆరుగురు ఆడబిడ్డలు. వీరు 5 తరాల పిల్లలను చూశారు. బురుజుపల్లిలో వీరి 5 మంది మగబిడ్డల సంతానం సగం ఊరిగా ఉంది. వీరి కుటుంబంలో మొత్తం 160 మంది ఉన్నారు. ఈ మండలంలో వంద సంవత్సరాలకు పైగా బతికిన వ్యక్తులంటూ ఉంటే పెద్దసుబ్బరాయుడు, పెద్దకేశమ్మలు అని అందరూ చెప్పుకుంటున్నారు. వీరి అంత్యక్రియలు బురుజుపల్లిలోనే సోమవారం సాయంత్రం జరిగాయి.



మృతి చెందిన పెద్దసుబ్బరాయుడు, పెద్దకేశమ్మ (ఫైల్ ఫొటోలు)

షార్ట్ సర్క్యూట్‌తో పాలవ్యాన్ దగ్ధం

వివరాలు....6లో

కొండను తవ్వేశారు..

- అక్రమంగా గ్రావెల్ తరలింపు
- కొండ కింద భూమి ఆక్రమణ



వివరాలు....6లో

కళాకారుడి దారుణ హత్య

- నాటకంలో పాత్రల విషయమై ఘర్షణ
- రాయితో కొట్టి హత్య

చట్ట పరిధిలో సమస్యలను
పరిష్కరించాలి

- ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించొద్దు
- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



బాధితుడి వద్దకు స్వయంగా వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో పోలీసు అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా ఎస్పీకి విన్నవించుకోగా వారి సమస్యలపై ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తన తల్లి ద్వారా వేరే వ్యక్తులు వేలిముద్ర వేయించుకుని, నమ్మించి మోసం చే శారని, ఇంటి స్థలం స్వాధీనం చేసుకున్నారని తనకు న్యాయం చేయాలని ఎస్పీకి ఓ బాధితురాలు ఫిర్యాదు చేసింది. అలాగే తనకు, తన పిల్లలకు భర్త ద్వారా ప్రాణహాని ఉందని న్యాయం చేయాలని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. తన భర్త తనకు తెలియకుండా ఇంకో పెళ్లి చేసుకున్నాడని, తనను ఇంట్లోకి రానీయకుండా వేధిస్తున్నాడని, న్యాయం చేయాలని ఓ బాధితురాలు ఎస్పీ ఫిర్యాదు చేశారు. తన సొంత స్థలాన్ని వేరే వ్యక్తి ఆక్రమించి, స్థలం నాది అంటూ దౌర్జన్యం చేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఓ బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఇలా పలువురు బాధితులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. బి.కొత్తకోటలో తన స్థలాన్ని కబ్జా చేశారని పీజే మోహన్ అనే బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. బాధితుడు నడవలేని స్థితిలో ఉన్నాడని తెలుసుకున్న ఎస్పీ తన ఛాంబర్ నుంచి నేరుగా బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుని సమస్యను చట్ట పరిధిలో పరిష్కరించాలని మదనపల్లె డీఎస్పీని ఆదేశించారు.

ఎమ్మెల్యేను కలిసిన
తహసీల్దార్ ఖాజాబీ

- ఇద్దరినీ కలిపేలా మధ్యవర్తుల రాజీయత్నాలు

మదనపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను తహసీల్దార్ ఖాజాబీ సోమవారం ఉదయం ఆయన నివాసంలో కలిశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఇటీవల కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. అందుకు ప్రతిగా తహసీల్దార్ కూడా ఎమ్మెల్యేపై సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఇటీవల నారావారిపల్లెలో ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా అంతర్గతంగా కొనసాగుతున్న వివాదం పరస్పర ఫిర్యాదులతో ఒక్కసారిగా భగ్గుమంది. అంతేకాకుండా చివరకు అది కాస్తా రాజకీయ రంగు పులుముకోవడంతో వివాదం మరింత పెద్దదై ఎడమొహం, పెడ మొహానికి దారి తీసింది. దీంతో అప్పటి నుంచి అటు ఎమ్మెల్యే, ఇటు తహసీల్దార్‌లు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటున్నప్పటికీ మూగనోముగా పాటిస్తున్నారు. దీంతో అప్పటి నుంచి తహసీల్దార్ పెద్దగా కార్యాలయంలో ఉండటం లేదని చెబుతున్నారు. అటు రెవెన్యూ సదస్సులు, క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనులు అంటూ తహసీల్దార్ ఎక్కువ సమయం బయటే ఉన్నట్లు అటు వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలు, రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ పరమైన అంశాలు చాలా వరకూ స్తంభించిపోయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ కలుగజేసుకుని తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఎమ్మెల్యేను కలసి సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం తహసీల్దార్ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కలవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఇటీవల జరిగిన పరిణామాలు చర్చకు రాగా అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో తహసీల్దార్ ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిసింది. వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేను ఆశ్రయించగా వాటిని పరిష్కరించడంలో భాగంగా ఫోన్ చేస్తే వెళ్లానని తహసీల్దార్ ఖాజాబీ చెప్పుకొచ్చారు. మరోవైపు ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాలతో కొందరు ఇరువురి మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తహసీల్దార్, ఎమ్మెల్యేను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రజల సమస్యలకే ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వమత సమ్మేళనానికి నిదర్శనమైన భారతదేశం శాంతియుత దేశమని, ప్రపంచ శాంతి కోసం కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో సేవ్ ఎర్త్-నో వార్ (యుద్ధం వద్దు, శాంతి ముద్దు) అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ యుద్ధాల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. మన దేశం శాంతి, మతసామరస్యానికి నిలయం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఎలాంటి విపత్తు జరిగిన శాంతియుత వాతావరణంలో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. మనదేశంలో ఎటువంటి యుద్ధాలు జరగకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతిని నెలకొల్పాలని రాయచోటి ప్రాంతం నుంచి సేవ్ ఎర్త్-నో వార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచానికి శాంతి సందేశాన్ని పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఇప్పటి నుంచే క్రమశిక్షణ మార్గంలో నడిచి మంచి భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరూ కులమతాలకతీతంగా శాంతియుత పోరాటం చేయడం వల్ల ఎటువంటి సంఘటనలు జరగకుండా నివారించవచ్చన్నారు. నూతన అన్నమయ్య జిల్లాలో ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ఈ ప్రాంతాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం నుంచి ఎస్ఎన్ కాలనీ శివాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చిన్నపరెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సతీశ్‌కుమార్, రోటరీక్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ పబ్బిశెట్టి సురేశ్‌కుమార్, జిల్లా అధికారి సయ్యద్ అస్రఫ్‌అలీ, టీడీపీ నేతలు ఇర్షాద్‌అలీఖాన్, ఎస్ఎండీ రఫీ, రవీంద్రారెడ్డి, రమణారెడ్డి, వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.4 ఆర్‌సీటీ 23: రాయచోటిలో జరిగిన సేవ్ ఎర్త్- నోవార్ అవగాహన ర్యాలీలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో జరిగిన సేవ్ ఎర్త్- నోవార్ అవగాహన ర్యాలీలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు

షార్ట్ సర్క్యూట్‌తో పాలవ్యాన్ దగ్ధం



ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లో కాలిపోయిన పాల వ్యాన్

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పాలవ్యాన్ దగ్ధం అయిన సంఘటన మదనపల్లె మండలం, చిప్పిలిలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లెకు చెందిన శ్రీనివాసులు పాలవ్యాపారం నిర్వహించేవాడు. ఇందులో భాగంగా పాలు సేకరించడానికి పల్లెలకు వెళ్తుండగా ఆ వాహనం మదనపల్లె మండలం, చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో ఎలక్ట్రిక్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. వెంటనే సమచారం అందుకున్న మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.4.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత సంచారంతో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్

ములకలచెరువు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనుగొండ రిజర్వు ఫారెస్టులో చిరుతపులి సంచరిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బురకాయలకోట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్‌తాజ్ సూచించారు. మండలంలోని కనుగొండ అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కనుగొండలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రజలు ఎవరూ అడివివైపు వెళ్లరాదని, చిరుతపులి గ్రామాల్లోకి వచ్చే అవకాశం లేదని, ప్రజలు భయపడొద్దన్నారు.

అనంతరం ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కడపలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను చౌకగా అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు.

నేషనల్ ప్రైమ్ ప్రైవేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులు, పంటల సరళి, వాతావరణ మార్పులను పరిగణలోకి తీసుకోకుండా వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడం నల్లచట్టాల అమల్లో భాగమేనన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకటశివ, సీఐటీయూ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టక్కోలి మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, శేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు (బీకేఎంయూ) మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన

దక్షిణాంధ్ర లూథరన్ చర్చి



రైల్వేకోడూరులో బ్రిటీష్ కాలంలో నిర్మించిన చర్చి

- రైల్వేకోడూరు చర్చికి 144 ఏళ్లు
- చెక్కుచెదరని బ్రిటీషు కాలం నాటి చర్చి
- రేపు క్రిస్మస్ పండుగ

రైల్వేకోడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్గేట్ వద్ద ఉన్న దక్షిణాంధ్ర లూథరన్ చర్చి 143 ఏళ్లు పూర్తి చేసుకుని 144వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. కోడూరు చర్చి సంఘ వ్యవస్థాపకుడిగా ఉన్న జోహన్ వర్లిన్ హయాంలో ఈ చర్చిని నిర్మించారు. 1882లో చర్చి స్థలంలో జర్మనీకి చెందిన పాల్ పీటర్సన్ సువార్త సేవ కోసం దర్శించారు. 1883లో జోహన్ వర్లిన్ కోడూరు మిషనరీలో పనిచేశారు. చర్చి పక్కనే 1885లో ఒక బంగ్లాను నిర్మించారు. ఆ సమయంలోనే పేద పిల్లలకు చదువు అందించడానికి హెచ్ఎంఎం హైస్కూల్‌ను స్థాపించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. ఈ చర్చిని నిర్మించిన తర్వాత రెడ్డివారిపల్లె, కొర్లకుంట, చిట్వేలి, పెద్దూరు తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న చర్చిలను నిర్మించారు. 1951లో చర్చి పాస్టర్‌గా కలపాటి దేవదాసు వ్యవహరించారు. ఎస్‌పీఎల్ పాఠశాలలను కూడా నిర్మించారు. ఈ పాఠశాలకు 1962లో పురుషోత్తం కరస్పాండెంట్‌గా వ్యవహరించారు. కోడూరుకు సమీపంలోని బాలపల్లె సమీపంలో ఉన్న జ్యోతి కాలనీలో జోయల్ హెన్రీ మేయర్, కె.విజయరత్నం చర్చిని నిర్మించారు. రోగులకు దుస్తులు తదితరాలను వీరు పంపిణీ చేసే వారు. చర్చి మిషనరీ వారు కోడూరుకు 2 కిలోమీటర్ల దూరంలో 13 ఎకరాల విస్తీర్ణంలో 1904-06లో ప్రత్యేకంగా కుష్టు రోగులకు చికిత్సాలయం నిర్మించారు. రోగులకు 100 పడకల వసతి కల్పించారు. లాంగ్ మెమోరియల్ టైప్ రైటింగ్ సంస్థను లిలియన్ మేయర్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థాపించారు. జోహన్ వర్లిన్, వర్బర్, విట్మన్, స్కిట్రా, ఓల్ట్రస్, ఐజాక్, స్వాన్, డోర్మన్, హెచ్‌డబ్ల్యూ మేయర్, షూల్స్, డబ్ల్యూఎన్ వైస్, జెహెజ్ మేయర్ తదితరులు గురు మండలంలో సువార్త సేవలు నిర్వహించారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగినది రైల్వేకోడూరు చర్చి. క్రైస్తవులు ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈనెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి లోపల, బయట రంగులు వేసి పనులు పూర్తిచేశారు. విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చర్చిలు విస్తరించాయి. క్రిస్మస్ రోజున పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా చేస్తున్నారు. చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రిస్మస్ రోజున కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా మారింది.

మరో చర్చి నిర్మాణానికి...



చర్చి నిర్మించి 144 ఏళ్లు అయింది. బ్రిటీషు కాలం నాటి చర్చి కావడంతో కొత్తగా నిర్మించాలని సంఘ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. చర్చి ఆవరణలోనే మరో చర్చి నిర్మాణానికి భూమి పూజ చేశాము. నిర్మాణాలకు అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాము. క్రిస్మస్‌ను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం.

ఖాను, చర్చి సంఘ చైర్మన్, రైల్వేకోడూరు

క్రిస్మస్ సందర్భంగా కార్యక్రమాలు



క్రిస్మస్‌ను పురస్కరించుకుని కార్యక్రమాలు చేపట్టనున్నాము. ముందస్తుగా సెమీ క్రిస్మస్ చేస్తున్నాము. పిల్లలకు ఆటల పోటీలు, యేసు పాటలు, నృత్యాలు నిర్వహిస్తారు. ఈసారి చర్చిని సుందరంగా అలంకరిస్తున్నారు. క్రిస్మస్ రోజున ప్రార్థనలు తదితర కార్యక్రమాలు ఉంటాయి.

ఇమానియల్‌బాబు, పాస్టర్, రైల్వేకోడూరు



చర్చి ఆవరణలో నిర్మించిన కలవరికండ

కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తి



జేసీ సమక్షంలో టెండర్ బాక్సును ఓపెన్ చేస్తున్న దృశ్యం

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడికి వెళ్లే విద్యార్థుల్లో అంధత్వం, దృష్టిలోపం నివారణకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3, 200 కళ్లద్దాల కోసం ఈ నెల 14 టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, టెండర్ దరఖాస్తులను సమర్పించడం కోసం ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ తనిఖీ చేసి తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన ముస్తాక్‌కు 3,200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లు ఆయన తెలిపరు.

సైనిక్ స్కూల్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ పాఠశాలలో ఏడు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 10వ తేదీలోగా కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఏడాది కంట్రాక్టు పద్ధతిన నియామకాలు జరుగుతాయని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్‌తో పాటు రెండేళ్ల అనుభవం ఉండాలి (జీతం రూ.73,491), కంప్యూటర్ సైన్స్ పీజీటీ పోస్టు ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.62,356), పీజీటీ మ్యాథమ్యాటిక్స్ పోస్టుకు రిజర్వేషన్ లేదు (జీతం రూ.62,356), టీజీటీ సోషియల్ సైన్స్ పోస్టును ఎస్సీలకు కేటాయించారు (జీతం రూ.58,819), పీటీఐ/మాట్రన్ పోస్టును జనరల్ మహిళలకు కేటాయించారు (జీతం రూ.58,819), కౌన్సిలర్ పోస్టును ఓబీసీ ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.58,819), జనరల్ కేటగిరీలో గుర్రపు స్వారీ శిక్షకుడు పోస్టు (జీతం 38,252)కు నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాల కోసం కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

కళాకారుడి దారుణహత్య

- నాటకంలో పాత్రల విషయమై ఘర్షణ
- రాయితో కొట్టి హత్య
- గుట్టలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గాలివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాటకంలో పాత్రల విషయంలో ఏర్పడిన వివాదం ఒకరి హత్యకు కారణమైంది. పోలీసుల కథనం మేరకు... ఒక వ్యక్తి పెద్దకర్మ సందర్భంగా నాటకం ప్రదర్శించేందుకు పది మంది కళాకారుల బృందం ఆదివారం రాత్రి మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు చేరుకుంది. నూలివీడు పంచాయతీ కొత్తబండివాండ్లపల్లెకు చెందిన మల్లెల సత్యన్న (వెంకట్రమణ), నక్కల వాండ్లపల్లెకు చెందిన సొప్పరం రమణారెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన కళాకారులు ఈ బృందంలో ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో మల్లెల సత్యన్న(వెంకట్రమణ), రమణారెడ్డి నాటకంలో పాత్రల పోషణ విషయంలో ఘర్షణ పడ్డారు. వెంటనే నిర్వాహకులు కలుగజేసుకుని ఇరువురిని సర్దుబాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు కథ పూర్తి కావడంతో కళాకారులందరూ ఎవరి వాహనాల్లో వారు వెళ్లిపోగా, సత్యన్న (వెంకట్రమణ) బోరెడ్డిగారిపల్లె సమీపంలోని బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. ఇంతలో రమణారెడ్డి అక్కడికి వెళ్లి మరోసారి ఘర్షణ పడడంతో పాటు, అక్కడే ఉన్న బండరాయితో దాడి చేసి సత్య న్నను హత్య చేశాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రెండు కిలో మీటర్ల దూరం తీసుకువెళ్లి పూలుకుంట పంచాయతీ పెద్దారగుట్టలోని బండరాళ్ల మధ్య పడవేసి వెళ్లారని వివరించారు. బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్ద రోడ్డుపై రక్తపు మరకలు గుర్తించిన ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో తాము సంఘటనాస్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం చేసిన విచారణలో హత్య విషయం వెల్లడి కావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ హత్య వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారన్న విషయం తెలియాల్సి ఉందన్నారు. మృతుడి అన్న అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వివరించారు.

కొండను తవ్వేశారు...

- అక్రమంగా గ్రావెల్ తరలింపు
- కొండ కింద భూమి ఆక్రమణ



కొండను తవ్వి చదును చేసిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. గుట్టను తవ్వేసి గ్రావెల్ (గుట్ట ఎర్రమట్టి)ను ఇష్టానుసారంగా తరలించారు. మండలంలోని సర్వే నెంబరు-1128లో దొరిచెరువు కొండ ఉంది. అక్కడ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కొంతమంది నిరుపేదలకు భూములు ఇచ్చారు. కొండకు మరోపక్క వాహనాలు వెళ్లడానికి కూడా వీలు పడేది కాదు. అలాంటి ప్రాంతానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దారి ఏర్పాటు చేసుకుని ఎక్స్‌కవేటర్ల ద్వారా కొండను తవ్వేసి వేల ట్రాక్టర్ల మట్టిని తరలించారు. రాయచోటి, రామాపురం మండలాలకు కూడా ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించారు. తవ్వేయడంతో కొండంతా సదరమైపోయింది అప్పటి రెవెన్యూ అధికారులు కొండ ప్రాంతానికి వెళ్లి చూసిన పాపానపోలేదని విమర్శలు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా ఏర్పడిన వెంటనే స్థలాలకు రెక్కలు వచ్చాయి. రాయచోటి, రామాపురం ప్రాంతాల్లో ప్లాట్ల వ్యాపారం అప్పట్లో జోరుగా సాగింది. దీంతో ఇక్కడి కొండలోని ఎర్రమట్టిని లేఅవుట్‌లకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇదే కాకుండా మండలంలోని దప్పేపల్లె, పాశెం గొల్లపల్లె, కోనంపేట గ్రామాల్లో కొండలు, గుట్టలను తవ్వి మట్టి తరలించడంతో తమ పొలాలకు సమీపంలో ఉన్న కొండలు, గుట్టలను ఆక్రమించుకున్నారు. 1128 సర్వే నెంబరులో కూడా కొండను తవ్వేసి భూమిని చదును చేసుకుని అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ అప్పట్లో రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కొండ వేంపల్లె-రాయచోటి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తరలించారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు నీరు వచ్చే వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువను కూడా మట్టితో కప్పేసి ఆ దారిలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కొని కొండలోని మట్టిని తరలించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దొరిచెరువు కొండ

ఎర్రమట్టి తరలించకుండా నిఘా పెడతాం

- శ్రీనివాసులు, తహసీల్దార్

మండలంలో భూఅక్రమాలు, ఇసుక మట్టి తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చినప్పటి నుంచి మట్టి తరలింపు జరగలేదు. గతంలో జరిగి ఉండవచ్చు. ఇప్పటి నుంచి కొండపై ప్రత్యేక నిఘా పెట్టి కొండను తవ్వకుండా, మట్టిని తరలించకుండా రాత్రివేళల్లో సిబ్బందిని కాపలా పెడతాము. మండలంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు చేపడతాం.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

నూతన బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి



నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో 8 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని, రాబోయే రోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీని బలోపేతం చేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని, రాబోయే కాలంలో ఏపీఎస్‌ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను రోడ్లపైకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాము, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ ఎస్‌వై బాషా, జతిన్ ట్రావెల్స్ యజమాని బాబురెడ్డి, టీడీపీ నేతలు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం : ఎస్పీ



పోలీసు సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది, వ్యక్తిగత, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. అలాగే కడప జిల్లాకు చెందిన కొంతమంది పోలీసు సిబ్బంది కూడా ఎస్పీని కలిసి సమస్యలు చెప్పుకున్నారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను విన్న ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అలాగే సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ 'పల్లెనిద్ర'తో మారిన తెల్లపాడు పరిస్థితులు

- మెరుగైన పారిశుధ్యం.. మౌలిక వసతుల కల్పన
- గ్రామానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు

కలసపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు విని అక్కడిక్కడే పరిష్కారం మార్గం చూపించాలన్న లక్ష్యంతో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గత నెల నవంబరు 22న కలసపాడు మండలంలోని తెల్లపాడు పంచా యతీలో కలెక్టరు శ్రీధర్ చెరుకూరి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమావేశాలు నిర్వహించి అక్కడి ప్రజలతో మమేకమై మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గం చూపారు. ఆ వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధితశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచా యతీలో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హరిజనవాడలో విద్యుత్ తీగలు తొలగింపు

పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు హరిజనవాడలో ప్రజలు ఎదు ర్కొం టున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సీలకు ఇళ్ల మంజూరు కాగా తక్కువ మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని చేప ట్టారు. దీనికి ప్రధాన కారణం ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు వెళుతుం డడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేదు. ఇందుకు స్పందించిన కలెక్టరు విద్యుత్ తీగలు తొలగించివేరే మార్గంలో వేయా లని ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ అధి కారులు విద్యుత్ తీగలు తొలగించడంతో హరిజనవాడలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి మార్గం సుగమమైంది.



మురుగునీటి కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుధ్యం సిబ్బంది

మౌలిక వసతుల కల్పన

తెల్లపాడు పంచాయతీలో తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, మురు గుకాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించిన కలెక్టరు మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి మంజూరైన పనులను వేగవంతంగా మొదలుపెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన పారిశుధ్యం

తెల్లపాడు గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవించేది. చిన్నపాటి వర్షం కురిసినా గ్రామంలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై స్పందించిన కలెక్టరు పారి శుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రామంలో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయడంతో పారిశుధ్య పరిస్థితులు మెరుగయ్యాయి.

ఆర్టీసీ బస్సుల రాకపోకలు

తెల్లపాడు పంచాయతీలో గత 20 సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సు రాలేదని పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు శ్రీధర్ చెరుకూరికి తెలుపగా వెంటనే స్పందించారు. రోజూ ఆర్టీసీ బస్సును నడిపేలా ఆర్టీసీ ఆర్ఎంకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు మహిళలు, ప్రజలు మండలానికి వెళ్లి పనిచేసుకునే వారు తమ హర్షం వ్యక్తం చేశారు.



తెల్లపాడుకు వచ్చిన ఆర్టీసీ బస్సు(ఫైల్)



ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తొలగించిన దృశ్యం

ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, చంద్రశేఖర్



శ్రీనివాసులు, చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీ ఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, బి.చంద్ర శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయం లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో కడప జిల్లా ఎస్‌టీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొవ్వూరు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజగోపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వి.చిన్నరాముడు నాయక్, బి.రవీంద్రారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా డి.సుమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆలమూరు ప్రసాద్, మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా శ్రీని వాసులు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరికొంతమందిని కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఈ ఎన్నికలకు ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరా యుడుయాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర గౌరవ సలహా దారుడు చీమల శ్రీనివాసులు పరిశీలకులుగా వ్యవహరించారు.

ఘనంగా మానసిక వ్యాధుల ఆసుపత్రి వార్షికోత్సవం



ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రాంగణంలో గల ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రి మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసు పత్రి ప్రారంభమై సంవత్సరం విజయవంతంగా గడిచినందున అనేక మంది రోగులకు చికిత్సలు అందించి బాగుచేయడం జరిగిందని మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు తెలిపారు. జిల్లాలోనే కాక రాయలసీమలోనే గొప్ప వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రిగా పేరు రావడం సంతోషకరమన్నారు. ఆసుపత్రి ప్రారంభమై నేటికి సంవత్సరం అయి న సంద ర్భంగా ఆసుపత్రి ఆవరణలో సిబ్బందితో కట్ చేశారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగ.. షాక్‌తో రైతు మృతి



రుద్ర శివానందరెడ్డి మృతదేహం

వేంపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని టి.వెలమవారిప ల్లెకు చెందిన రుద్ర శివా నందరెడ్డి (40) అనే రైతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. శివానం దరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం తెల్లవారుజా మున అరటితోటకు నీళ్లు పారగట్టుకునేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో తోటలో తెగిపడ్డ కరెంటు వైరును తగలడంతో విద్యు త్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శివానందరెడ్డి మృతితో భార్య పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.


అనారోగ్యంతో ఆంధ్రజ్యోతి విలేకరి మృతి



తల్లం వెంకటనాగప్రసాద్ (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆంధ్రజ్యోతి విలేకరి తల్లం వెంకట నాగప్రసాద్ (49) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈయన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మైదుకూరు విలేకరిగా సుదీ ర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లా రు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సంతాపం తెలిపారు. కాగా.. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తి మృతి



పోరుమామిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యో తి): కడపలో ఆదివారం జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్‌స్ట్రోక్ గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రసాద్ (40) మృతి చెం దాడు. బంధువుల వివరాల మేరకు.. పోరుమామిళ్లలోని తంబాబావివీధికి చెందిన రాళ్లపల్లె ప్రసాద్ ఆదివారం కడపలో జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడంతో రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించ గా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెండ్లిమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామ సమీపం లోని నాగరాజు ప్లాట్ల వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా అక్కడికి సిబ్బంది వచ్చి పరిశీ లించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందాలి

- ఎన్‌జిరంగ విశ్వవిద్యాలయం ఉపకులపతి



వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి పంటను పరిశీలిస్తున్న ఉపకులపతి శారదజయలక్ష్మి, శాస్త్రవేత్తలు

సికెదిన్నె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శా స్త్రవేత్తలు సృష్టించిన నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు రైతులకు బాగా ఉపయో గపడాలని ఆచార్య ఎన్‌జిరంగ విశ్వవిద్యా లయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజ యలక్ష్మి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్య వసాయ పరిశోధన స్థానాన్ని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని, ఏరువాక కేంద్రాన్ని సోమవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు లకు యూటీఆర్ 181 వరి వంగడాన్ని రై తులకు అందజేయాలని.. అదే విధంగా ను వ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పనలో పు రోగతిని, ఆముదపు పంటను కడప జిల్లా లో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయ డానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వరిలో ఉల్లికోడు తట్టుకునే కొత్త వంగడాలను త యారు చేయాలని శాస్త్రవేత్తలకు సూచిం చారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల కు మంచి విద్యాబోధనను అందించి వారి ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వే యాలన్నారు. రైతుల అభివృద్ధికి కృషి వి జ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చేయాల్సిన కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యాన, పాడి, కోళ్లు, గొర్రెలు,మే కల పెంపకంపై దృష్టి పెట్టేలా. రైతులకు మెరుగైన సేవలు అందించి వారి వ్యవసా యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏడీఆర్ డాక్టర్ సుమతి, వ్యవసాయ పరిశోధన స్థా నం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి,మాధు రి, భాగవతప్రియ,ప్రశాంతి, శిల్పకళ, మ హేష్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి త దితరులు పాల్గొన్నారు.

వైవీయూలో నియామకాలు



నియామకపత్రాలు అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవి ద్యాలయంలో పలు విభాగాలకు నూతన కోఆర్డినేటర్లను, నోడల్ ఆఫీ సర్‌ను నియమిస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం వైవీయూలోని వీసీ చాంబ ర్‌లో ఆచార్య కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మతో కలిసి వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బాధ్యతలు తీసుకున్న ఆచార్య రియాజున్నీసా, డాక్టర్ హరినాథ్, డాక్టర్ ఎస్పీ వెంకటరమణను అభినందిస్తూ ప్రభా వంతంగా పనిచేయాలని సూచించారు. కాగా, డెవలప్‌మెంట్ సెక్షన్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కె.రియాజున్నీసా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇది వరకు పనిచేస్తున్న జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉస్మాన్ బాషా బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. ఫైనాన్స్ విభాగం కోఆర్డినేటర్‌గా డాక్టర్ జి.హరనాథ్ నియమితులయ్యారు. స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్‌గా జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ వెంకటరమణను నియ మించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. భారతదేశం అంతటా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను, ఫెలోషిప్, స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ వంటి ప్రయోజనాలు పొందేలా ఈ విభాగం పనిచేస్తుం దన్నారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలో తృతీయ విజేతగా కడప క్రీడాకారిణి



కడప స్పోర్ట్స్, డిసంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈనెల 22వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి 53వ బీఆర్ డీసీఏ చెస్ టోర్నమెంట్ అండర్-16 విభాగంలో కడప నగ రానికి చెందిన గోరంట్ల తేజోమయి ప్రతిభ కనబరచి తృతీయ విజేతగా నిలిచింది. బెంగుళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ (బీఆర్‌డీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మొత్తం 6 రౌండ్లలో 4 పాయింట్లు సాధిం చిన తేజోమయి జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన గావించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ వెల్లడించారు. కడపలో గల విద్యామందిర్ పాఠశా లలో 9వ తరగతి చదువుతున్న తేజోమయి మునుముందు మరిన్ని పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అశ్వవాహనంలో దర్శనమిచ్చిన ఈశ్వరీదేవి అమ్మవారు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు సోమవారం భక్తులకు అశ్వవాహనంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా రెండో రోజు ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించా రు. అంతకుముందు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మఠాధిపతి వీరకు మారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పత్తి క్వింటాకు రూ.7521 మద్దతు ధర

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో పండించిన పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినట్లు ఏవో రామాంజలురెడ్డి తెలిపారు. పొడుగు గింజ క్వింటాకు రూ.7521, పొట్టిగింజ క్వింటాకు రూ. 7121 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. నంద్యాల బీసీజీ కాటన్ మిల్లులో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. మద్దతుధర కావలసిన రైతులు తమ ధ్రువపత్రాలతో రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాల న్నారు. మండలంలోని రైతులు ప్రభుత్వ నింబంధనల ప్రకారం తమ ప్రత్తిని అమ్మదలుచుకుంటే బీసీజీ కాటన్‌మిల్లు, నంద్యాల వారిని 8884229387, 9704100670 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఏవో తెలిపారు.

తుది దశకు...హైవే పనులు

- రూ.425 కోట్లతో ముద్దనూరు- తాడిపత్రి మధ్య నాలుగులేన్ల రహదారి
- మార్చి నాటికి పనులు పూర్తి
- పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-తాడిపత్రి మధ్య జరుగుతున్న నేషనల్ హైవే (ఎన్‌హెచ్-67) పనులు తుదిదశ కు చేరుకున్నాయి. ఈ రహదారిపై విపరీతంగా ట్రాఫిక్ ఉండటంతో కేంద్రప్రభుత్వం రూ.425 కోట్లతో 51 కిలో మీటర్ల మేర నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను చేపట్టింది. 2022 జనవరిలో పనులు ప్రారంభం కాగా... ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి.



కొండాపురం మండలం ఏటూరు వద్ద చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన

వేగంగా రహదారి విస్తరణ పనులు

ఈ నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను సీఎం సురేష్ నాయుడుకు చెందిన సీఆర్‌అసోసియేట్స్ సంస్థ నిర్వహిస్తోంది. అధునిక యంత్రాలతో రహదారి నిర్మాణపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఏటూరు వద్ద ఉన్న చిత్రావతి వంతెనపై నిర్మాణం కూడా పూర్తయింది. అదేవిధంగా జోగాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరు గుతున్నాయి. కొండాపురం పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల పాదా చారులు నడవడానికి సర్వీసురోడ్డు ను కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా నాలుగులేన్ల రహదారి మధ్యలో విద్యుత్ దీపాలను అమర్చే ప్రక్రియ కూడా మొదలుపెట్టారు. మధ్యలో కల్వర్టులు, బ్రిడ్జి లు కూడా పూర్తవడంతో వచ్చే ఏడాది జనవరి నాటికి మొదటిదశ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా మంగపట్నం వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రహదారి పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం

ఈ రహదారిపై 51 కిలోమీటర్లు ప్రయాణించేందుకు గతంలో సుమారు గంటన్నర సమయం పట్టేది. ప్రస్తుతం రహదారి నిర్మాణం

కొండాపురం మండలం ఓబన్నపేట వద్ద పూర్తయిన నాలుగులైన్ల రహదారి



పూర్తయితే గంటలో ముద్దనూరు నుంచి తాడిపత్రికి చేరుకోవచ్చు. సుమారు అరగంట సమయం తగ్గడంతో పాటు ట్రాఫిక్ కూడా తగ్గనుంది. నాలుగులైన్ల రహదారి పనులు పూర్తికానుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి

వచ్చే ఫిబ్రవరి నాటికి దాదాపు ఈ రహదారి పనులు పూర్తవుతాయి. పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. ఈ రహదారి నిర్మాణపనులు పూర్తికావడానికి వచ్చే ఆగస్టు వరకు గడువు ఉంది. అయితే గడువుకంటే ముందే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

-సురేంద్రారెడ్డి, ఏఈ, నేషనల్ హైవే

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

రాజంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోలాటం నరసింహ, సుజాత దంపతుల కుటుంబానికి జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఈ దంపతులు మృతిచెందగా, వారి పిల్లలకు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణ సోమవారం మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

సంబేపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయచోటి డైట్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో సంబేపల్లె మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. వర్చువల్ హియరింగ్ అండ్ డిజిటల్ యాక్సిస్ టు కన్స్యూమర్ జస్టిస్ అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి విశ్వానందరెడ్డి తృతీయ బహుమతి, వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం అంశంపై వక్తృత్వ పోటీలో పదో తరగతి విద్యార్థిని డీ. మంజుల తృతీయ బహుమతికి ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ వారికి నగదు బహుమతి, షీల్డు, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు.

రెడ్డిపల్లెలో బస్సులు ఆపాలి

పుల్లంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డిపల్లెలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని సోమవారం బీజేపీ నాయకులు రాజంపేట ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. రెడ్డిపల్లెలో ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోడూరు అసెంబ్లీ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, కంబాల శ్రీనివాసులు, మల్లికార్జున, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

ఓబులవారిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరమని అధికారులు అన్నారు. మండల కార్యాలయం సముదాయ పరిధిలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా అగ్రికల్చర్ ఆఫీసర్ బి.మల్లిక, వెటర్నరీ అధికారి దుర్గ, మహిళా సంఘాల కోఆర్డినేటర్ మల్లికార్జునరాజు సహకారంతో స్టాళ్లను తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రసాయన రహిత వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంసీఏ బుల్లయ్య, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగంపేటలోని ఏపీఎండీసీ వైద్య కేంద్రంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడి ప్రారంభించారు. సుమారు 100 మంది వైద్య చికిత్సలు పొందినట్లు భవ్య హెల్త్ సర్వీస్ సిబ్బంది తెలిపారు. ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, వైద్యసిబ్బంది, హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్యాం, మేనేజర్ దిలీప్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆ సారు.. రూటే సపరేటు

- పాఠశాల అభివృద్ధి పట్టని అయ్యవారు
- నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- నిరుపయోగంగా నిర్మాణ సామగ్రి
- మందుబాబుల నిలయాలుగా భవనాలు



అర్ధాంతరంగా పనులు ఆగిపోవడంతో నిరుపయోగంగా మారిన భవనం

సంబేపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధి, అందులోని విద్యార్థుల సంక్షేమంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన నిర్వాకం నిధులు నిరుపయోగంగా మారగా, అర్ధాంతరంగా నిర్మాణం ఆగిపోయిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు కింద 8 తరగతి గదుల నిర్మాణానికి రూ.84 లక్షలు మంజూరైంది. ఈ పనుల నిర్వహణపై ప్రధానో పాధ్యాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం ఈ నిర్మాణాలు మందుబాబులకు నిలయంగా మారాయి. పనులు చేయకపోవడంతో వివిధ పాఠశాలలకు ఇక్కడ నుంచి సామగ్రిని తరలించారు. ఈ పనులకు సంబంధించిన డోర్లు, కిటికీలు, టైల్స్ వివిధ సామగ్రి పాఠశాలలో నిరుపయోగంగా పడి ఉంది. పాఠశాలలో కొళాయిలు విరిగిపోయినా పట్టించుకోలేదు. సాంకేతిక విద్యా బోధన కోసం విద్యుత్ సౌకర్యం కల్పిస్తే మీటర్ కాలిపోయినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నాయి. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనిచేయక పోవడంతో విద్యార్థులు సొంత డబ్బులు పెట్టి నీళ్లు తెచ్చుకున్నారు. పదో తరగతి పరీక్ష ఫీజు అదనంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశాలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని పాఠశాల కమిటీ సభ్యులు చెబుతున్నారు.



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న సిమెంటు బస్తాలు

స్కూల్ కమిటీ ఖాతా తెరవలేదు



పాఠశాల కమిటీ ఎన్నికలు జరిగి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకు కమిటీ పేరుతో బ్యాంకు ఖాతా తెరవలేదు. ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పడం లేదు. మారుమూల ప్రాంతం నుంచి వస్తున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

- రామాంజులమ్మ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్

పనులు చేయడం లేదు

భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిర్మాణ సామగ్రి ఇచ్చినా పనులు చేయడం లేదు. పనులు కొనసాగిస్తే మరింత సామగ్రి అందించేందుకు సిద్దంగా ఉన్నాం. పనులు చేయకపోతే, ఇతర ప్రాంతాలకు సామగ్రి తరలిస్తారు. పనులు నిలిచిపోడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు, ఎంఈవో

విద్యుత్ తీగలను వెంటనే తొలగించండి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న హెచ్ఎం పద్మజ

చిన్నమండెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. సోమవారం చిన్నమండెం మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల భవనం పైనుంచి వెళుతున్న విద్యుత్ తీగల కారణంగా విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బోరును ప్రారంభించారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని ఉపాధ్యాయులు కోరగా, చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

రెడ్డినాయక్‌కు పరామర్శ

రామాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలి బిడికీకి చెందిన బుక్కే రెడ్డినాయక్ ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించారు. ఎంఎస్‌ఆర్ఎం ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ రామాంజనేయులు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రేఖం శివ, లోకేశ్, చిట్టి రామసుబ్బయ్య, మాజీ సర్పంచ్ సీతారాంనాయక్, రాజానాయక్, ధనుంజయ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

పుల్లంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరంలాంటిదని రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర అన్నారు. మండల పరిధిలోని సీతారాంపేట గ్రామంలో బీమిశెట్టి బలరామయ్యకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన 4,16,250 రూపాయల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి దొంతు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : ఒంటిమిట్ట మండల పరిదిలోని నరవ కాటిపల్లెకు చెందిన కృష్ణవేణికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 30 వేల చెక్కును టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, గంప శివ, ఊటుకూరు చెరువు సంఘ అధ్యక్షుడు నామా హరినాథ్, తదితరులు పాల్గొన్నారు. శనివారం వడ్డిపల్లె చెరువు కట్ట రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన భువనగిరి పల్లెకు చెందిన నరసింహ, సుజాత దంపతుల మృతదేహాలను సందర్శించి నివాళు లర్పించారు. గుండెపోటుతో మృతి చెందిన తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రైల్వేకోడూరు: సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రాజంపేట: కృష్ణవేణికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

'ఆర్అండ్‌బీ అధికారులు మొద్దునిద్ర వీడాలి'

గాలివీడు, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ అధికారులు మొద్దు నిద్ర వీడి ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. స్థానిక గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణకు గురైన ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆక్రమణకు గురైన దాదాపు 1.55 ఎకరాల భూమిలోని అక్రమ నిర్మాణాల్లో కొన్నింటిని రెవెన్యూ అధికారుల చొరవతో తొలగించారని, ఆ స్థలానికి కంచె ఏర్పాటు చేయకపోవడం ఆక్రమణదారులను ప్రోత్సహించడమేనన్నారు. రోడ్డుకు ఓ వైపు నిర్మాణాలను తొలగించి మరోవైపు తొలగించకపోవడం అనుమానాలను తావిస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలుగు రోడ్ల కూడలిలోని భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

'ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి'

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లి నియోజకవర్గం బీ. కొత్తకోట మండలం 17వ గ్రామ సమాఖ్య సంఘమిత్ర లక్ష్మీనరసమ్మ పేరు ఆన్‌లైన్‌లో తొలగించిన గత ఏపీఎం మురళిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి సలీంబాషా డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీ. కొత్తకోట మండలం 17వ గ్రామ సమాఖ్య సంఘమిత్రగా దాదాపు 14 ఏళ్లుగా పనిచేస్తున్న సంఘమిత్ర ఎలాంటి ఆరోపణలు లేకుండా పని చేసిందని తెలిపారు. దాదాపు 31 గ్రూపుల సభ్యులు ఎవరూ ఎలాంటి ఆరోపణలు చేయకున్నా తంబళ్లపల్లి నియోకవర్గం అధికార పార్టీ కీలక నేత చెప్పాడని, సంఘమిత్ర లక్ష్మి నరసమ్మ పేరు ఆన్‌లైన్‌లో తొలగించి అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ విషయంపై మూడు నెలలుగా కలెక్టర్, పీడీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించలేదని తెలిపారు.

క్యాబ్ డ్రైవర్లకు బకాయిలు చెల్లించాలి

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎలెక్షన్‌ల్లో అధికారులు వినియోగించుకున్న క్యాబ్‌లకు చెల్లించాల్సిన దాదాపు రూ. 30 లక్షల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అద్దెకిచ్చిన క్యాబ్ డ్రైవర్లతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 37 వాహనాలు, 7 కాన్వాయ్ వాహనాలను వినియోగించుకున్న అధికారులు అందుకు కేటాయించిన బడ్జెట్‌ను వేరే అవసరాలకు వాడుకొని క్యాబ్ డ్రైవర్లకు మొండిచేయి చూపారన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, త్వరలో పెండింగ్ బిల్లులు రిజర్వ్ బ్యాంకు దగ్గర పెండింగ్ ఉన్నాయని, పది రోజుల్లో బిల్లులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రమణ, జోహార్, భాస్కర్, రాంబాబు, మధుసూదన్, సైఫుల్లా, రమేశ్‌బాబు, అక్బర్‌బాషా, సౌకత్, సత్యకుమార్ , మస్తాన్‌లు పాల్గొన్నారు.

ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

●సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జీఎన్ఎస్ఎస్- హెచ్ఎన్ఎస్ఎస్ పైపులైన్ అనుసంధాన పథకంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వాసితులైన రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని స్థిరీకరించడంతో పాటు తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రారంభించిన ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి, పెద్దమండెం మండలాల్లో 250 మందికిపైగా రైతులను రోడ్డున పడేసిన ఘనత వైసీపీ ప్రభుత్వందేనన్నారు. భూమికి, భూమి ప్రత్యామ్నాయం చూపించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, రైతులు శంకర, భాస్కర్, పవన్, శ్రీనివాసులు, మస్తాన్‌రెడ్డి, ఎరుకులరెడ్డి, నరసింహులు, సుగుణ, మంజుల, సుకన్య, వీరమల్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో ఆర్‌జేడీ తనిఖీలు

సిద్దవటం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాకరాపేట జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆర్‌జేడీ శామ్యూల్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతశాతం పెంచేందు కృషి చేయాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీకేసమ్మ, పీడీ రామచంద్రయ్య పాల్గొన్నారు.

మానవీయ విలువలపై అవగాహన అవసరం

రామాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిత్వం, విలువలు, ఆత్మ విశ్వాసం జ్ఞాపక శక్తి పెంపొందించుకోవాలని ప్రముఖ రచయిత్రి విరసం సభ్యురాలు శశికళ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. పుస్తక పఠనంతో ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలాదే వి, ఉపాధ్యాయ బృందం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎఫ్ఆర్వో శ్యాంసుందర్

రైల్వేకోడూరు(రూరల్) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో అరటి పంట నష్టపోయిన రైతులకు కోడూరు అటవీశాఖ అధికారి శ్యాంసుందర్ సోమవారం నష్ట పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండలం వై కోట గ్రామానికి చెందిన నక్కన సుబ్బరత్నమ్మకు రూ.42 వేలు, కొండేటి చలపతికి రూ.10 వేల రూపాయిల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళలపై హింస అనాగరికం



జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

వీరబల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింస అనాగరికమని మండలాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు తగ్గినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. తహసీల్దార్ శ్రావణి మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టడంలో మహిళా సంఘాలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. మహిళా సమాఖ్య నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి, ఈవోపీఆర్‌డీ రామ చంద్రా రెడ్డి, మట్లి గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి, వెలుగు సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, మండల సమాఖ్య కార్యదర్శి గులాబ్‌జాన్, ఉపాధ్యాయురాలు వారాదమ్మ, వీవోఏలు తులసి, కవిత, మహేశ్వర్‌రెడ్డి, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన అవసరం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

రాజంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు దినోత్సవం సందర్భంగా అన్నమాచార్య యూనివర్శిటీలోని వ్యవసాయ కళాశాలలో సోమవారం భారత మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు రాజకుమారి, సిద్దేశ్వరి మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు జైపాల్ పాల్గొన్నారు. కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక శ్రీ సాయివికాస్ ఉన్నత పాఠశాలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థులు కొత్తపల్లిలో రైతులతో కలిసి పొలాలను సందర్శించి వ్యవసాయ పద్ధతులు, ఆధునిక పనిముట్లను తెలుసుకున్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



విజ్‌డమ్ స్కూల్‌లో ప్రత్యేక వస్త్రధారణలో చిన్నారులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని డాల్ఫిన్‌డేల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ పంజం సుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ పంజం సృజని ఆధ్వర్యంలో, కొత్తబజారులోని విజ్‌డమ్ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ టి.ప్రదీప్ డైరెక్టర్ టి.మదన్మోహన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్ బాబు ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి నందలూరు సమస్యలు

నందలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కడప పర్యటనకు మొట్టమొదటిసారి విచ్చేసిన పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు నందలూరు సమస్యలు విన్నవించినట్లు నియోజకవర్గ జనసేన నాయకుడు కొట్టే శ్రీహరి తెలిపారు. బౌద్ధరామాలున్న ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు స్థానంలో ప్రత్యామ్నాయ ప్రాజెక్టు నిర్మించాలని కోరగా ఇక్కడి పరిస్థితులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలియజేశారన్నారు.

27 నుంచి విద్యుత్ చార్జీలపై వైసీపీ పోరుబాట

రాయచోటిటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27 నుంచి వైసీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించనుందని ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మూడు సార్లు విద్యుత్‌చార్జీలు పెంచిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలు, విద్యుత్ స్టేషన్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. .

వంట ఏజెన్సీ మార్పునకు ఏకగ్రీవ తీర్మానం

సిద్దవటం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వంట ఏజెన్సీ మార్చాలని పాఠశాల తల్లిదండ్రుల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మండలంలోని ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తయారీకి నూతన ఏజెన్సీని నియమించాలని తీర్మానించామన్నారు. హెడ్మాస్టర్ నాగమునిరెడ్డి మాట్లాడుతూ 16 మంది విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

రాజంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కడప నుంచి తిరుపతికి వెళ్లే జాతీయ రహదారి గుంతలమయం కావడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయని, వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని జనసేనపార్టీ నాయకుడు రామా శ్రీనివాస్ రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవికి వినతిపత్రం సమర్పించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పాలవ్యాన్ దగ్ధం



ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లో కాలిపోయిన పాల వ్యాన్

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పాలవ్యాన్ దగ్ధం అయిన సంఘటన మదనపల్లె మండలం, చిప్పిలిలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లెకు చెందిన శ్రీనివాసులు పాలవ్యాపారం నిర్వహించేవాడు. ఇందులో భాగంగా పాలు సేకరించడానికి పల్లెలకు వెళ్తుండగా ఆ వాహనం మదనపల్లె మండలం, చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో ఎలక్ట్రిక్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. వెంటనే సమచారం అందుకున్న మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.4.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత సంచారంతో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్

ములకలచెరువు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనుగొండ రిజర్వు ఫారెస్టులో చిరుతపులి సంచరిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బురకాయలకోట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్‌తాజ్ సూచించారు. మండలంలోని కనుగొండ అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కనుగొండలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రజలు ఎవరూ అడివివైపు వెళ్లరాదని, చిరుతపులి గ్రామాల్లోకి వచ్చే అవకాశం లేదని, ప్రజలు భయపడొద్దన్నారు.

అనంతరం ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కడపలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను చౌకగా అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు.

నేషనల్ ప్రైమ్ ప్రైవేట్ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులు, పంటల సరళి, వాతావరణ మార్పులను పరిగణలోకి తీసుకోకుండా వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడం నల్లచట్టాల అమల్లో భాగమేనన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకటశివ, సీఐటీయూ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టక్కోలి మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, శేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు (బీకేఎంయూ) మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన

దక్షిణాంధ్ర లూథరన్ చర్చి

- రైల్వేకోడూరు చర్చికి 144 ఏళ్లు
- చెక్కుచెదరని బ్రిటీషు కాలం నాటి చర్చి
- రేపు క్రిస్మస్ పండుగ



రైల్వేకోడూరులో బ్రిటీష్ కాలంలో నిర్మించిన చర్చి

రైల్వేకోడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్గేట్ వద్ద ఉన్న దక్షిణాంధ్ర లూథరన్ చర్చి 143 ఏళ్లు పూర్తి చేసుకుని 144వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. కోడూరు చర్చి సంఘ వ్యవస్థాపకుడిగా ఉన్న జోహన్ వర్లిన్ హయాంలో ఈ చర్చిని నిర్మించారు. 1882లో చర్చి స్థలంలో జర్మనీకి చెందిన పాల్ పీటర్సన్ సువార్త సేవ కోసం దర్శించారు. 1883లో జోహన్ వర్లిన్ కోడూరు మిషనరీలో పనిచేశారు. చర్చి పక్కనే 1885లో ఒక బంగ్లాను నిర్మించారు. ఆ సమయంలోనే పేద పిల్లలకు చదువు అందించడానికి హెచ్‌ఎంఎం హైస్కూల్‌ను స్థాపించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. ఈ చర్చిని నిర్మించిన తర్వాత రెడ్డివారిపల్లె, కొర్లకుంట, చిట్వేలి, పెద్దూరు తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న చర్చిలను నిర్మించారు. 1951లో చర్చి పాస్టర్‌గా కలపాటి దేవదాసు వ్యవహరించారు. ఎస్‌పీఎల్ పాఠశాలలను కూడా నిర్మించారు. ఈ పాఠశాలకు 1962లో పురుషోత్తం కరస్పాండెంట్‌గా వ్యవహరించారు. కోడూరుకు సమీపంలోని బాలపల్లె సమీపంలో ఉన్న జ్యోతి కాలనీలో జోయల్ హెన్రీ మేయర్, కె.విజయరత్నం చర్చిని నిర్మించారు. రోగులకు దుస్తులు తదితరాలను వీరు పంపిణీ చేసే వారు. చర్చి మిషనరీ వారు కోడూరుకు 2 కిలోమీటర్ల దూరంలో 13 ఎకరాల విస్తీర్ణంలో 1904-06లో ప్రత్యేకంగా కుష్ఠు రోగులకు చికిత్సాలయం నిర్మించారు. రోగులకు 100 పడకల వసతి కల్పించారు. లాంగ్ మెమోరియల్ ట్రైప్ రైటింగ్ సంస్థను లిలియన్ మేయర్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థాపించారు. జోహన్ వర్లీన్, వర్బర్, విట్మన్, స్కిట్రా, ఓల్ట్రస్, ఐజాక్, స్వాన్, డోర్మన్, హెచ్‌డబ్ల్యూ మేయర్, మూల్స్, డబ్ల్యూఎస్ వైస్, జెహెజ్ మేయర్ తదితరులు గురు మండలంలో సువార్త సేవలు నిర్వహించారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగినది రైల్వేకోడూరు చర్చి. క్రైస్తవులు ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈనెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి లోపల, బయట రంగులు వేసి పనులు పూర్తిచేశారు. విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చర్చిలు విస్తరించాయి. క్రిస్మస్ రోజున పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా చేస్తున్నారు. చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రిస్మస్ రోజున కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా మారింది.

మరో చర్చి నిర్మాణానికి...



చర్చి నిర్మించి 144 ఏళ్లు అయింది. బ్రిటీషు కాలం నాటి చర్చి కావడంతో కొత్తగా నిర్మించాలని సంఘ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. చర్చి ఆవరణలోనే మరో చర్చి నిర్మాణానికి భూమి పూజ చేశాము. నిర్మాణాలకు అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాము. క్రిస్మస్‌ను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం.

ఖాను, చర్చి సంఘ చైర్మన్, రైల్వేకోడూరు

క్రిస్మస్ సందర్భంగా కార్యక్రమాలు



క్రిస్మస్‌ను పురస్కరించుకుని కార్యక్రమాలు చేపట్టను న్నాము. ముందస్తుగా సెమీ క్రిస్మస్ చేస్తున్నాము. పిల్లలకు ఆటల పోటీలు, యేసు పాటలు, నృత్యాలు నిర్వహిస్తారు. ఈసారి చర్చిని సుందరంగా అలంకరిస్తున్నారు. క్రిస్మస్ రోజున ప్రార్థనలు తదితర కార్యక్రమాలు ఉంటాయి.

ఇమానియల్‌బాబు, పాస్టర్, రైల్వేకోడూరు



చర్చి ఆవరణలో నిర్మించిన కలవరికండ

కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తి



జేసీ సమక్షంలో టెండర్ బాక్సును ఓపెన్ చేస్తున్న దృశ్యం

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడికి వెళ్లే విద్యార్థుల్లో అంధత్వం, దృష్టిలోపం నివారణకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3, 200 కళ్లద్దాల కోసం ఈ నెల 14 టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, టెండర్ దరఖాస్తులను సమర్పించడం కోసం ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ తనిఖీ చేసి తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన ముస్తాక్‌కు 3,200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లు ఆయన తెలిపరు.

సైనిక్ స్కూల్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ పాఠశాలలో ఏడు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 10వ తేదీలోగా కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఏడాది కంట్రాక్టు పద్ధతిన నియామకాలు జరుగుతాయని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్‌తో పాటు రెండేళ్ల అనుభవం ఉండాలి (జీతం రూ.73,491), కంప్యూటర్ సైన్స్ పీజీటీ పోస్టు ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.62,356), పీజీటీ మ్యాథమ్యాటిక్స్ పోస్టుకు రిజర్వేషన్ లేదు (జీతం రూ.62,356), టీజీటీ సోషియల్ సైన్స్ పోస్టును ఎస్సీలకు కేటాయించారు (జీతం రూ.58,819), పీటీఐ/మ్యాట్రన్ పోస్టును జనరల్ మహిళలకు కేటాయించారు (జీతం రూ.58,819), కౌన్సిలర్ పోస్టును ఓబీసీ ఎన్‌సీఎల్‌కు రిజర్వు చేశారు (జీతం రూ.58,819), జనరల్ కేటగిరీలో గుర్రపు స్వారీ శిక్షకుడు పోస్టు (జీతం 38,252)కు నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాల కోసం కలికిరి సైనిక్ స్కూల్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

కళాకారుడి దారుణహత్య

- నాటకంలో పాత్రల విషయమై ఘర్షణ
- రాయితో కొట్టి హత్య
- గుట్టలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

గాలివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాటకంలో పాత్రల విషయంలో ఏర్పడిన వివాదం ఒకరి హత్యకు కారణమైంది. పోలీసుల కథనం మేరకు... ఒక వ్యక్తి పెద్దకర్మ సందర్భంగా నాటకం ప్రదర్శించేందుకు పదిమంది కళాకారుల బృందం ఆదివారం రాత్రి మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు చేరుకుంది. నూలివీడు పంచాయతీ కొత్తబండివాండ్లపల్లెకు చెందిన మల్లెల సత్యన్న (వెంకట్రమణ), నక్కల వాండ్లపల్లెకు చెందిన సొప్పరం రమణారెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన కళాకారులు ఈ బృందంలో ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో మల్లెల సత్యన్న(వెంకట్రమణ), రమణారెడ్డి నాటకంలో పాత్రల పోషణ విషయంలో ఘర్షణ పడ్డారు. వెంటనే నిర్వాహకులు కలుగజేసుకుని ఇరువురిని సర్దుబాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు కథ పూర్తి కావడంతో కళాకారులందరూ ఎవరి వాహనాల్లో వారు వెళ్లిపోగా, సత్యన్న (వెంకట్రమణ) బోరెడ్డిగారిపల్లె సమీపంలోని బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. ఇంతలో రమణారెడ్డి అక్కడికి వెళ్లి మరోసారి ఘర్షణ పడడంతో పాటు, అక్కడే ఉన్న బండరాయితో దాడి చేసి సత్యన్నను హత్య చేశాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రెండు కిలో మీటర్ల దూరం తీసుకువెళ్లి పూలుకుంట పంచాయతీ పెద్దారగుట్టలోని బండరాళ్ల మధ్య పడవేసి వెళ్లారని వివరించారు. బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్ద రోడ్డుపై రక్తపు మరకలు గుర్తించిన ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో తాము సంఘటనాస్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం చేసిన విచారణలో హత్య విషయం వెల్లడి కావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ హత్య వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారన్న విషయం తెలియాల్సి ఉందన్నారు. మృతుడి అన్న ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వివరించారు.

కొండను తవ్వేశారు...

- అక్రమంగా గ్రావెల్ తరలింపు
- కొండ కింద భూమి ఆక్రమణ



కొండను తవ్వి చదును చేసిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. గుట్టను తవ్వేసి గ్రావెల్ (గుట్ట ఎర్రమట్టి)ను ఇష్టానుసారంగా తరలించారు. మండలంలోని సర్వే నెంబరు-1128లో దొరిచెరువు కొండ ఉంది. అక్కడ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కొంతమంది నిరుపేదలకు భూములు ఇచ్చారు. కొండకు మరోపక్క వాహనాలు వెళ్లడానికి కూడా వీలు పడేది కాదు. అలాంటి ప్రాంతానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దారి ఏర్పాటు చేసుకుని ఎక్స్‌కవేటర్ల ద్వారా కొండను తవ్వేసి వేల ట్రాక్టర్ల మట్టిని తరలించారు. రాయచోటి, రామాపురం మండలాలకు కూడా ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించారు. తవ్వేయడంతో కొండంతా సదరమైపోయింది అప్పటి రెవెన్యూ అధికారులు కొండ ప్రాంతానికి వెళ్లి చూసిన పాపానపోలేదని విమర్శలు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా ఏర్పడిన వెంటనే స్థలాలకు రెక్కలు వచ్చాయి. రాయచోటి, రామాపురం ప్రాంతాల్లో ప్లాట్ల వ్యాపారం అప్పట్లో జోరుగా సాగింది. దీంతో ఇక్కడి కొండలోని ఎర్రమట్టిని లేఅవుట్‌లకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇదే కాకుండా మండలంలోని దప్పేపల్లె, పాశెం గొల్లపల్లె, కోనంపేట గ్రామాల్లో కొండలు, గుట్టలను తవ్వి మట్టి తరలించడంతో తమ పొలాలకు సమీపంలో ఉన్న కొండలు, గుట్టలను ఆక్రమించుకున్నారు. 1128 సర్వే నెంబరులో కూడా కొండను తవ్వేసి భూమిని చదును చేసుకుని అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ అప్పట్లో రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కొండ వేంపల్లె-రాయచోటి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తరలించారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు నీరు వచ్చే వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువను కూడా మట్టితో కప్పేసి ఆ దారిలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కొని కొండలోని మట్టిని తరలించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దొరిచెరువు కొండ

ఎర్రమట్టి తరలించకుండా నిఘా పెడతాం

- శ్రీనివాసులు, తహసీల్దార్

మండలంలో భూఅక్రమాలు, ఇసుక మట్టి తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చినప్పటి నుంచి మట్టి తరలింపు జరగలేదు. గతంలో జరిగి ఉండవచ్చు. ఇప్పటి నుంచి కొండపై ప్రత్యేక నిఘా పెట్టి కొండను తవ్వకుండా, మట్టిని తరలించకుండా రాత్రివేళల్లో సిబ్బందిని కాపలా పెడతాము. మండలంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు చేపడతాం.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

నూతన బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి



నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో 8 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశ్యమని, రాబోయే రోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీని బలోపేతం చేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని, రాబోయే కాలంలో ఏపీఎస్‌ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను రోడ్లపైకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాము, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ ఎస్‌వై బాషా, జతిన్ ట్రావెల్స్ యజమాని బాబురెడ్డి, టీడీపీ నేతలు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం : ఎస్పీ



పోలీసు సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది, వ్యక్తిగత, బిల్లన్స్, మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. అలాగే కడప జిల్లాకు చెందిన కొంతమంది పోలీసు సిబ్బంది కూడా ఎస్పీని కలిసి సమస్యలు చెప్పుకున్నారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను విన్న ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అలాగే సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ 'పల్లెనిద్ర'తో మారిన తెల్లపాడు పరిస్థితులు

- మెరుగైన పారిశుధ్యం.. మౌలిక వసతుల కల్పన
- గ్రామానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు

కలసపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు విని అక్కడిక్కడే పరిష్కారం మార్గం చూపించాలన్న లక్ష్యంతో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గత నెల నవంబరు 22న కలసపాడు మండలంలోని తెల్లపాడు పంచా యతీలో కలెక్టరు శ్రీధర్ చెరుకూరి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమావేశాలు నిర్వహించి అక్కడి ప్రజలతో మమేకమై మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గం చూపారు. ఆ వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధితశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచా యతీలో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హరిజనవాడలో విద్యుత్ తీగలు తొలగింపు

పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు హరిజనవాడలో ప్రజలు ఎదు ర్కొం టున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సీలకు ఇళ్ల మంజూరు కాగా తక్కువ మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని చేప ట్టారు. దీనికి ప్రధాన కారణం ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు వెళుతుం డడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేదు. ఇందుకు స్పందించిన కలెక్టరు విద్యుత్ తీగలు తొలగించివేరే మార్గంలో వేయా లని ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ అధి కారులు విద్యుత్ తీగలు తొలగించడంతో హరిజనవాడలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల కట్టుకోవడానికి మార్గం సుగమమైంది.


తెల్లపాడుకు వచ్చిన ఆర్టీసీ బస్సు(ఫైల్)


ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తొలగించిన దృశ్యం


మురుగునీటి కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుధ్యం సిబ్బంది

మౌలిక వసతుల కల్పన

తెల్లపాడు పంచాయతీలో తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, మురు గుకాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించిన కలెక్టరు మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి మంజూరైన పనులను వేగవంతంగా మొదలుపెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన పారిశుధ్యం

తెల్లపాడు గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవించేది. చిన్నపాటి వర్షం కురిసినా గ్రామంలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై స్పందించిన కలెక్టరు పారి శుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రామంలో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయడంతో పారిశుధ్య పరిస్థితులు మెరుగయ్యాయి.

ఆర్టీసీ బస్సుల రాకపోకలు

తెల్లపాడు పంచాయతీలో గత 20 సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సు రాలేదని పల్లెనిద్రలో భాగంగా కలెక్టరు శ్రీధర్ చెరుకూరికి తెలుపగా వెంటనే స్పందించారు. రోజూ ఆర్టీసీ బస్సును నడిపేలా ఆర్టీసీ ఆర్ఎంకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు మహిళలు, ప్రజలు మండలానికి వెళ్లి పనిచేసుకునే వారు తమ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్టీయూఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, చంద్రశేఖర్


శ్రీనివాసులు, చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, బి.చంద్ర శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయం లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో కడప జిల్లా ఎస్టీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొవ్వూరు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజగోపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వి.చిన్నరాముడు నాయక్, బి.రవీంద్రారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా డి.సుమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆలమూరు ప్రసాద్, మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా శ్రీని వాసులు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరికొంతమందిని కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఈ ఎన్నికలకు ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరా యుడుయాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర గౌరవ సలహా దారుడు చీమల శ్రీనివాసులు పరిశీలకులుగా వ్యవహరించారు.

ఘనంగా మానసిక వ్యాధుల ఆసుపత్రి వార్షికోత్సవం


ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రాంగణంలో గల ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రి మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసు పత్రి ప్రారంభమై సంవత్సరం విజయవంతంగా గడిచినందున అనేక మంది రోగులకు చికిత్సలు అందించి బాగుచేయడం జరిగిందని మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు తెలిపారు. జిల్లాలోనే కాక రాయలసీమలోనే గొప్ప వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రిగా పేరు రావడం సంతోషకరమన్నారు. ఆసుపత్రి ప్రారంభమై నేటికి సంవత్సరం అయి న సంద ర్భంగా ఆసుపత్రి ఆవరణలో సిబ్బందితో కట్ చేశారు. మానసిక వ్యాధుల ఆసు పత్రి సూపరింటెండెంట్ వెంకటరాముడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనంలో దర్శనమిచ్చిన ఈశ్వరీదేవి అమ్మవారు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు సోమవారం భక్తులకు అశ్వవాహనంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా రెండో రోజు ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించా రు. అంతకుముందు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మఠాధిపతి వీరకు మారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగ.. షాక్‌తో రైతు మృతి


రుద్ర శివానందరెడ్డి మృతదేహం

వేంపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.వెలమవారిపల్లెకు చెందిన రుద్ర శివానందరెడ్డి (40) అనే రైతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. శివానందరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం తెల్లవారుజామున అరటితోటకు నీళ్ల పారగట్టుకునేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో తోటలో తెగిపడ్డ కరెంటు వైరును తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శివానందరెడ్డి మృతితో భార్య పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో ఆంధ్రజ్యోతి విలేకరి మృతి


తల్లం వెంకటనాగప్రసాద్ (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆంధ్రజ్యోతి విలేకరి తల్లం వెంకట నాగప్రసాద్ (49) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈయన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మైదుకూరు విలేకరిగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సంతాపం తెలిపారు. కాగా.. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తి మృతి



పోరుమామిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యో తి): కడపలో ఆదివారం జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్‌స్ట్రోక్ గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రసాద్ (40) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. పోరుమామిళ్లలోని తంబాబావివీధికి చెందిన రాళ్లపల్లె ప్రసాద్ ఆదివారం కడపలో జరిగిన బలిజ సంఘం సమావేశానికి వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడంతో రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందినట్లు వారు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెండ్లిమర్రి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలోని నాగరాజు ప్లాట్ల వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా అక్కడికి సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందాలి

- ఎన్‌జిరంగ విశ్వవిద్యాలయం ఉపకులపతి


వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి పంటను పరిశీలిస్తున్న ఉపకులపతి శారదజయలక్ష్మి, శాస్త్రవేత్తలు

సికెదిన్నె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు సృష్టించిన నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు రైతులకు బాగా ఉపయోగపడాలని ఆచార్య ఎన్‌జిరంగ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానాన్ని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని, ఏరువాక కేంద్రాన్ని సోమవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూటీఆర్ 181 వరి వంగడాన్ని రైతులకు అందజేయాలని.. అదే విధంగా నువ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పనలో పురోగతిని, ఆముదపు పంటను కడప జిల్లాలో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వరిలో ఉల్లికోడు తట్టుకునే కొత్త వంగడాలను తయారు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి విద్యాబోధనను అందించి వారి ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. రైతుల అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చేయాల్సిన కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యాన, పాడి, కోళ్ల, గొర్రెలు,మేకల పెంపకంపై దృష్టి పెట్టేలా. రైతులకు మెరుగైన సేవలు అందించి వారి వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏడీఆర్ డాక్టర్ సుమతి, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి,మాధురి, భాగవతప్రియ,ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో నియామకాలు


నియామకపత్రాలు అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పలు విభాగాలకు నూతన కోఆర్డినేటర్లను, నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం వైవీయూలోని వీసీ చాంబర్‌లో ఆచార్య కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మతో కలిసి వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బాధ్యతలు తీసుకున్న ఆచార్య రియాజున్నీసా, డాక్టర్ హరినాథ్, డాక్టర్ ఎస్‌పీ వెంకటరమణను అభినందిస్తూ ప్రభావంతంగా పనిచేయాలని సూచించారు. కాగా, డెవలప్‌మెంట్ సెక్షన్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కె.రియాజున్నీసా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇది వరకు పనిచేస్తున్న జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉస్మాన్ బాషా బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. ఫైనాన్స్ విభాగం కోఆర్డినేటర్‌గా డాక్టర్ జి.హరనాథ్ నియమితులయ్యారు. స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్‌గా జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌పీ వెంకటరమణను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. భారతదేశం అంతటా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను, ఫెలోషిప్, స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ వంటి ప్రయోజనాలు పొందేలా ఈ విభాగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలో తృతీయ విజేతగా కడప క్రీడాకారిణి



కడప స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈనెల 22వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి 53వ బీఆర్‌డీసీఏ చెస్ టోర్నమెంట్ అండర్-16 విభాగంలో కడప నగరానికి చెందిన గోరంట్ల తేజోమయి ప్రతిభ కనబరచి తృతీయ విజేతగా నిలిచింది. బెంగుళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ (బీఆర్‌డీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మొత్తం 6 రౌండ్లలో 4 పాయింట్లు సాధించిన తేజోమయి జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన గావించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ వెల్లడించారు. కడపలో గల విద్యామందిర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తేజోమయి మునుముందు మరిన్ని పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

తుది దశకు...హైవే పనులు

- రూ.425 కోట్లతో ముద్దనూరు- తాడిపత్రి మధ్య నాలుగులేన్ల రహదారి
- మార్చి నాటికి పనులు పూర్తి
- తగ్గనున్న ప్రయాణ సమయం

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-తాడిపత్రి మధ్య జరుగుతున్న నేషనల్ హైవే (ఎన్‌హెచ్-67) పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ రహదారిపై విపరీతంగా ట్రాఫిక్ ఉండటంతో కేంద్రప్రభుత్వం రూ.425 కోట్లతో 51 కిలో మీటర్ల మేర నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను చేపట్టింది. 2022 జనవరిలో పనులు ప్రారంభం కాగా... ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి.


కొండాపురం మండలం ఏటూరు వద్ద చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన

వేగంగా రహదారి విస్తరణ పనులు

ఈ నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులను సీఎం సురేష్ నాయుడుకు చెందిన సీఆర్అసోసియేట్స్ సంస్థ నిర్వహిస్తోంది. అధునిక యంత్రాలతో రహదారి నిర్మాణపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఏటూరు వద్ద ఉన్న చిత్రావతి వంతెనపై నిర్మాణం కూడా పూర్తయింది. అదేవిధంగా జోగాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. కొండాపురం పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల పాదాచారులు నడవడానికి సర్వీసురోడ్డు ను కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా నాలుగులేన్ల రహదారి మధ్యలో విద్యుత్ దీపాలను అమర్చే ప్రక్రియ కూడా మొదలుపెట్టారు. మధ్యలో కల్వర్టులు, బ్రిడ్జిలు కూడా పూర్తవడంతో వచ్చే ఏడాది జనవరి నాటికి మొదటిదశ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా మంగపట్నం వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రహదారి పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం

ఈ రహదారిపై 51 కిలోమీటర్లు ప్రయాణించేందుకు గతంలో సుమారు గంటన్నర సమయం పట్టేది. ప్రస్తుతం రహదారి నిర్మాణం పూర్తయితే గంటలో ముద్దనూరు నుంచి తాడిపత్రికి చేరుకోవచ్చు. సుమారు అరగంట సమయం తగ్గడంతో పాటు ట్రాఫిక్ కూడా తగ్గనుంది. నాలుగులైన్ల రహదారి పనులు పూర్తికానుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండాపురం మండలం ఓబన్నపేట వద్ద పూర్తయిన నాలుగులైన్ల రహదారి



వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి

వచ్చే ఫిబ్రవరి నాటికి దాదాపు ఈ రహదారి పనులు పూర్తవుతాయి. పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. ఈ రహదారి నిర్మాణపనులు పూర్తికావడానికి వచ్చే ఆగస్టు వరకు గడువు ఉంది. అయితే గడువుకంటే ముందే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

-సురేంద్రారెడ్డి, ఏఈ, నేషనల్ హైవే

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సమావేశం గత రెండు మూడు సార్లు వాయిదా పడింది. ఇటీవల గత ఆగస్టు నెలలో ఒకసారి మండల సమావేశాన్ని నిర్వహించేందుకు మండల అధికారులు సర్క్యులర్ జారీ చేసినా కూటమి నేతలు అడ్డుకోవడంతో ఆ సమావేశం వాయిదా పడింది. అటు తరువాత మళ్లీ ఒక్కసారి సమావేశం జరపాలని అధికారులు సన్నాహాలు చేసినా మళ్లీ కూటమి నేతలు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించి సమావేశాన్ని జరిపేందుకు అనుమతి తీసుకొచ్చారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇరువురు అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, నారామాకుల తాండాకు చెందిన ద్వారకనాథ్‌నాయక్(40), బాలాజీ నాయక్(52) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తాలుకా పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

కురబలకోట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనంరెడ్డిగారిపల్లె పంచాయతీ పెద్దపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత రామచంద్రారెడ్డి(65) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలో ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన మృతదేహానికి పలువురు టీడీపీ నేతలు నివాళులర్పించి అంత్యక్రియలను నిర్వహించారు.

డీలర్‌షిప్‌కు 83 దరఖాస్తులు

బి.కొత్తకోట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 6 చౌకదుకాణాల డీలర్‌షిప్ కొరకు 83 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ తెలిపారు. ఇంటర్ అర్హతతో వచ్చిన దరఖాస్తులపై ఆయా గ్రామాల వీఆర్వోలు పరిశీలించి నివేదిక ఇచ్చాక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. బి.కొత్తకోట దుకాణానికి 9, తుమ్మణంగుట్టకు 32, హార్సిలీహిల్స్‌కు 4, కోటావూరుకు 3, బయప్పగారిపల్లెకు 16, గట్టు గ్రామ చౌకదుకాణానికి 11 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ వివరించారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లెటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ప్రభుత్వాలు కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పేస్ సంస్థ ప్రతినిధి వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనానికి అనారోగ్యం

● 15 రోజులుగా పొరుగు మండల వాహనమే శరణ్యం



108 వాహనం లేక ఖాళీగా వున్న ఆసుపత్రి ప్రాంగణం

బి.కొత్తకోట, డిసెంబరు 23: మండల ప్రజలకు అత్యవసర సేవలు అందించే 108 వాహనం గత 15 రోజులుగా లేకుండా పోయింది. దీంతో బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు, ఇతర గ్రామాల ప్రజలు అత్యవసర వైద్య అవసరాలకు సమస్యగా మారింది. పొరుగున ఉన్న పీటీఎం నుంచో, కురబలకోట నుంచో 108 రావాల్సి వుండటంతో సమయాభావం ఏర్పడుతోంది. అప్పటి వరకు ఓపిక పట్టలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ములకలచెరువు మండలంలోనూ 108 వాహనం కొద్ది రోజులుగా లేకపోవడంతో పీటీఎం మండల వాహనంపై అదనపు భారం పడుతోంది. బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ కావడంతో రోగుల తాకిడి ఎక్కువగా వుంటోంది. మరోవైపు రాత్రిళ్లలో రోడ్డు ప్రమాదాలు, గర్భిణీలకు పురిటి నొప్పులు లాంటి అవసరాలకు 108 సకాలంలో అందుబాటులోకి రాలేకపోతోందని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై 108 వాహనాల సూపర్‌వైజర్ నాగభూషణను వివరణ కోరగా బి.కొత్తకోట వాహనం మరమ్మత్తులకు గురైందని, షెడ్డుకు తరలించామన్నారు. పనులు పూర్తి కావచ్చాయని, రెండుమూడు రోజులలో అందుబాటులోకి వస్తుందన్నారు.

సంఘమిత్రగా మహిళనే నియమించాలి

● ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి విన్నవించిన మర్రిపాడు మహిళా సంఘాలు



ఎమ్మెల్యే ముందు ఏకరువు పెడుతున్న మహిళా సంఘాల సభ్యులు

కలికిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని వీవోల పర్యవేక్షణకు మహిళనే సంఘమిత్రగా నియమించాలని గుర్రంకొండ మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన పలువురు మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పట్టుబట్టారు. సోమవారం కలికిరి అమరనాథరెడ్డి భవన్‌లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో పదేళ్ల పైబడి సంఘమిత్రగా పనిచేసిన విశ్వనాథ వ్యవహారాలతో తాము వేధింపులకు గురయ్యామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యవహారాల గురించి ఎమ్మెల్యే ముందు మహిళలంతా మూకుమ్మడిగా ఏకరువు పెట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన వైసీపీకి ప్రచారం చేశారని ఆరోపించారు. ప్రతి లోనుకు రూ.5 వేల వంతున వసూలు చేశారని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తిరిగి సంఘమిత్రగా కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. మహిళా సంఘాలతో సుదీర్ఘంగా మాట్లాడిన కిశోర్‌కుమార్ రెడ్డి వారి డిమాండు పట్ల సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలోనే కిశోర్‌కుమార్‌రెడ్డి మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్‌రెడ్డితో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, యోగేష్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయుని జగదీష్, మల్లికార్జునరెడ్డి, సహదేవరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, శేషాద్రిరెడ్డి, ఎస్సానుల్లా, అబ్దుల్‌ఖాదర్, అఫ్రోజ్, వైజాగ్ బాషా చిన్నరెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

తంబళ్లపల్లె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యులు బ్యాంకు లింకేజి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. గత వారం రోజుల్లో మండలంలోని 30 మహిళా సంఘాలకు సుమారు రూ.5 కోట్లు వరకు రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇండియన్ బ్యాంకు మేనేజరు హరినాథ్ గుప్తా మాట్లాడుతూ మండలంలో అర్హులైన మహిళా సంఘాల సభ్యులకు విరివిగా రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సంఘాల్లోని సభ్యులు బ్యాంకు నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని తిరిగి సకాలంలో చెల్లిస్తే మరింత ఎక్కువ రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సీసీలు నరసింహులు, రమణ, ఆదిలక్ష్మీ, ఇండియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవ్వరూ అధైరపడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఇటీవల గాయపడిన ఆవులపల్లె టీడీపీ కార్యకర్తలను సోమవారం రాత్రి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలపై దాడి చేసిన వారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తేలేదని, చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయం ఇప్పటికే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడానన్నారు. ఆయన వెంట అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి సంగీతోత్సవం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో జ్యోతిరావుపూలే నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి సంగీతోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కీ.శే. చెంచుగార్ల నారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఏపీపీసీబీ అండ్ స్టేట్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం మదనపల్లె అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎం.శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం జాతీయ అధ్యక్షుడికి సత్కారం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ స్వర్ణకార సంఘం జాతీయ అధ్యక్షుడిగా యస్పాల్‌సింగ్ చౌహాన్ ఎన్నిక కావడంతో మదనపల్లెకు చెందిన ఆ సంఘం నేతలు సత్కరించారు. ఆదివారం, సోమవారంలో పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో అఖిల భారతీయ స్వర్ణకార సంఘం జాతీయ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో నూతన జాతీయ అధ్యక్షుడిగా యస్పాల్ సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శిగా రవివర్మలు ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అభినందనలు తెలిపారు.

ప్రేమ వివాహానికి ఒప్పుకోలేదని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో యువకుడు నిప్పంటించుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. మదనపల్లె మండలం, బసినికొండ గ్రామం, డ్రైవర్స్ కాలనీకి చెందిన సిద్ధిక్ అమీర్(20) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకోవడానికి తన కుటుంబసభ్యులు అంగీకరించలేదని మనస్థాపానికి గురై ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు యువకుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

● కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె.మంజుల



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పీలేరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా తగ్గించాలని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.కె.మంజుల రైతులకు విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లాలోని మహానందిలో గల వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థులు జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం పీలేరు మండలం బాలంవారిపల్లెలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.మంజుల మాట్లాడుతూ విపరీతమైన రసాయనిక ఎరువుల వాడకం వల్ల ఉత్పత్తుల్లోనూ వాటి అవశేషాలు మిగిలిపోతున్నాయని, వాటిని ఆరగించిన ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన మోతాదు మేరకే ప్రకృతి, సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. మహానంది కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పవన్ కుమార్, శాస్త్రవేత్త సోమశేఖరబాబు, కేవీకే శాస్త్రవేత్త పీరూసాహెబ్, పీలేరు ఏడీ రమణరావు, పశువైద్య శాస్త్రవేత్త డా.నవీన మాట్లాడారు. అంతకుమునుపు వారు మహానంది విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతులు సురేంద్రరెడ్డి, నాగరాజు, చంద్రయ్య, బాలంవారిపల్లె రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు చిరస్మరణీయం



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కురబలకోట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర విభాగంలో శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు చిరస్మరణీయమని విభాగాధిపతి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం 135వ జయంతి వేడుకలను పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణితశాస్త్ర విభాగంలో ఆయన ఎనలేని సేవలనందించారని కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని గణితశాస్త్రంలో సమాజానికి దోహదపడే నూతన పరిశోధనలు చేపట్టి పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చికెన్ వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చికెన్ వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

వాల్మీకిపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మదనపల్లె మార్గంలో జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాల రోతపై గతవారం కిందట ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఈవో రవీంద్రనాథ్.. పంచాయతీ సిబ్బంది చేత రహదారిపై చికెన్ వ్యర్థాలను తొలగించి పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పట్టణంలోని చికెన్ దుకాణ నిర్వాహకులను కూడా హెచ్చరించారు. మళ్లీ పునరావృతం అయితే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించండి



గ్రీవెన్స్‌డేలో సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ కళాశాల హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఏఐఎస్ఎఫ్ బాలికా విభాగం నాయకురాలు గంగారాణి విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్(గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా వున్న విద్యార్థినుల హాస్టల్ వద్ద పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు విన్నవించామన్నారు. అయినా ఇప్పటి వరకు పోలీసులు బీట్‌లు పర్యటించలేదన్నారు. తాము కళాశాలకు, హాస్టల్‌కు వెళ్లేటప్పుడు ఆకతాయిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై విద్యార్థినులకు రక్షణ కల్పించే విధంగా పోలీసులను ఆదేశించాలని విద్యార్థినులు కోరారు. అలాగే తమ పిత్రార్జితంగా వచ్చిన భూమిని ప్రభుత్వ అవసరాలకు తీసుకున్నారని, ఇంత వరకు నష్టపరిహారం చెల్లించలేదని బసినికొండ గ్రామం ములకలదిన్నెకు చెందిన మంజునాథ వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు భూ వివాదాలు, పాసుపుస్తకాల మంజూరు, ఆన్‌లైన్‌లో వన్-బి రాలేదంటూ పలువురు సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. మొత్తం మీద 80 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పీటీఎంలోని పొగచూరి వీధిలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు పెద్ద ఎత్తున శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీంతో స్పందించిన అధికారులు సోమవారం పంచాయతీ తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. గత కొన్ని రోజులుగా స్థానిక పీటీఎంలోని పలు తాగునీటి బోర్లు మరమ్మతులకు గురికావడంతో పలు చోట్ల మంచినీటి సమస్య తలెత్తింది. గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించినా సమస్యను తీర్చకపోవడంతో శనివారం మహిళలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కాగా గ్రామంలో ఎక్కడైనా మంచినీటి సమస్య తలెత్తితే ముందుగా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఎంపీడీవో గ్రామస్థులను కోరారు.

పాఠశాల స్థలంలో బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికల గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో సోమవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలిసి బోర్డును ఏర్పాటు చేశారు. పట్టణానికి సమీపంలోని సర్వే నెంబరు 614, 615లో 4.85 ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ భూమి కొంతకాలంగా అన్యాక్రాంతం కావడంతో గుర్రంకొండ రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ, రెవెన్యూ అధికారులు గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోకి ప్రవేశిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును అమర్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీషా, వీఆర్వో భరత్, కార్యదర్శులు శ్రీహరి, నిస్సార్, సర్వేయర్ నందిని పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి సాధించాలి



హౌసింగ్ సమీక్షలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్

తంబళ్లపల్లె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ప్రతి వారం ప్రగతి సాధించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్, వెలుగు, సచివాలయ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఇళ్లు మంజూరై వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న వారు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం స్టేజీల వారిగా ఇళ్ల నిర్మాణాల్లో తప్పనిసరిగా ప్రగతి సాధించాలన్నారు. ఇచ్చిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆపేసిన లబ్ధిదారులకు వెలుగు సంఘాల ద్వారా రుణాలు అందించి నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, హౌసింగ్ ఏఈ సుజాత, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలి

● తహసీల్దార్‌కు వినతి

వాల్మీకిపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో వాల్మీకి (బీసీ-ఎ) కులస్థుల సమస్యలు పరిష్కరించాలని వాల్మీకి మహర్షి సేవాసమితి మండల అధ్యక్షుడు విష్ణుచైతన్య పేర్కొన్నారు. సోమవారం వాల్మీకి కులస్థులు, సంఘ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్ పామిలేటికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకి మహర్షి పేరిట ప్రాముఖ్యం పొందిన మహర్షి విగ్రహ స్థాపనకు స్థలం కేటాయించాలని, పట్టణంలో బీసీ-ఏలకు కేటాయించిన 9వ నెంబర్ ప్రభుత్వ చౌక దుకాణం వాల్మీకి కులస్థులకు కేటాయించాలని, తదితర డిమాండ్లు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ తప్పక పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి రమేష్, సభ్యులు, వాల్మీకి కులస్థులు పాల్గొన్నారు.

'నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు'

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డిసెంబరు 14న రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన చెరువులకు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో తనను నామినేషన్ వేయకుండా అధికారులు అడ్డుకున్నారని' మద్దయ్యగారిపల్లె పంచాయతీ దేవళంపేటకు చెందిన పోలం భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో ఉన్న పీటీఎం పెద్ద చెరువుకు ఎన్నికలు నిర్వహించగా ఉదయం 8గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకున్నానని, కానీ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మండల డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్‌రావు తనను నామినేషన్ వేయకుండా అడ్డుకుని తనకు అన్యాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ గాయత్రి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడప పట్టణం రామాంజనేయపురంకు చెందిన సాహెబ్ పీర్ భార్య షబానా(29) ఈ నెల 16న బెంగళూరు నుంచి భర్తతో కలిసి కడపకు వస్తూ మధ్యలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి కనపడకుండా పోయింది. సోమవారం షబానా తండ్రి బాదుషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీడీవోకు సత్కారం

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్‌కలాం ఆజాద్‌ను సోమవారం పీటీఎం మండల మైనారిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఆయా గ్రామాల్లో ఉన్న అసలైన లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు చెన్నరాయునిపల్లె పక్రుద్దీన్, రంగసముద్రం గ్రామానికి చెందిన మహబూబ్ బాష, పీటీఎంకు చెందిన మస్తాన్, సాధిక్‌బాష పాల్గొన్నారు.



ఎంపీడీవోను శాలువాతో సత్కరిస్తున్న మైనారిటీ నాయకులు